

యాదగిరిగుట్ట ఆలయం క్యూలైన్లలో భక్తులు

## యాదగిరిగుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, మే 17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు.

సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం జరిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.32,45,945 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.



లబ్ధిదారుడికి ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

## ఎల్ఓసీ అందజేత

భూదాన్ పోచంపల్లి, మే 17 : మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాతరాసి శ్రీకాంత్‌కు కిడ్నీ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 2.50లక్షల ఎల్ఓసీని హైదరాబాద్‌లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల రామకృష్ణారెడ్డి, నాయకులు మహేశ్, వెంకటేశ్‌యాదవ్, లవకుమార్, సంజీవరెడ్డి, సంతోష్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## గిరిజన గురుకులంలో ఇంటర్ అడ్మిషన్లు

సంస్థాన్ నారాయణపురం, మే 17 : మండల కేంద్రంలోని బాలుర గిరిజన గురుకుల కళాశాలలో 2024-2025 సంవత్సరానికి ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో ప్రవేశాలకు ఈ నెల 23న మిర్యాలగుడలోని అవంతిపురం గిరిజన గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

## లోతుకుంట మోడల్ కాలేజీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

వలిగొండ, మే 17 : మండలంలోని లోతుకుంట మోడల్ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ కోసం ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 10వ తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

# సైబరాబాద్‌లో డ్రగ్స్ పట్టివేత

- 6 గ్రాముల ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం
- ఇద్దరు విద్యార్థులు సహా నలుగురు వ్యక్తులు అరెస్టు

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ)/ మూసాపేట, జగద్గిరిగుట్ట : డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులు సహా నలుగురుని సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6 గ్రాముల ఎండీఎంఏ, 45 గ్రాముల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్, రోడ్ నం. 86లోని జూబ్లీ హైట్స్‌లో నివాసముండే కట్టా రాజశేఖర్‌రెడ్డి(29) వృత్తిరీత్యా ఫ్యాషన్ డిజైనర్. కూకట్‌పల్లికి చెందిన నీలేశ్ రెడ్డి(26) సైతం వృత్తిరీత్యా ఫ్యాషన్ డిజైనర్. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. వ్యసనాలకు అలవాటుపడిన వీరిద్దరూ సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గత కొన్ని రోజులుగా బెంగళూరుకు చెందిన ప్రేంసాయి వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి, నగరంలో తెలిసిన వారికి విక్రయిస్తున్నారు. శుక్రవారం నిందితులిద్దరు కూకట్‌పల్లిలోని శేషాద్రినగర్‌లో ఎండీఎంఏ డ్రగ్‌ను విక్రయిస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

### మరో కేసులో..

మరో కేసులో.. జగద్గిరిగుట్ట పరిధిలోని తులసినగర్‌లో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న జగద్గిరిగుట్టకు నివాసి తిలక్ సింగ్(22), తెల్లాపూర్ నివాసి జూలపల్లి అఖిల్ శివ (22)ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. తిలక్‌సింగ్ కొంపల్లిలోని శివ శివానీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి కాగా, జూలపల్లి అఖిల్ శివ చెన్నైలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో బీబీఏ 3వ సంత్సరం చదువుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు రెండు కేసుల్లో నలుగురిని అరెస్టు చేసి, తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు.

## ఆయుర్వేదిక్ ముసుగులో అలోపతిక్ ఔషధం

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): ఆయుర్వేదిక్ ముసుగులో అలోపతి ఔషధాలను విక్రయిస్తూ.. రోగులను మోసగిస్తున్న 'సంపూర్ణ ఆయుర్వేద నిలయం'పై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.1.5 లక్షల విలువైన ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డైరెక్టర్ జనరల్ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని సంపూర్ణ ఆయుర్వేద నియలంలో డయాబెటిక్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. అయితే, అక్కడ ఆయుర్వేద చికిత్స ముసుగులో రోగులకు ఆయుర్వేద మందులకు బదులుగా అలోపతిక్ యాంటి డయాబెటిక్ డ్రగ్‌ను(మెట్‌ఫర్మిన్, గ్లింపిరైడ్, గ్లిలజైడ్)తో చికిత్స చేస్తూ రోగులను మోసగిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు శుక్రవారం సంపూర్ణ ఆయుర్వేద నిలయంపై దాడులు జరిపి, రూ.1.5లక్షల విలువ చేసే ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు.

# సిజేరియన్లు చేస్తే కఠిన చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు యశోద, శిల్పిని
- పలు దవాఖానల్లో ఆకస్మిక తనిఖీలు

చౌటుప్పల్‌లోని ప్రియాంక దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

చౌటుప్పల్, మే 17 : ప్రైవేటు దవాఖానల్లో అనవసరంగా సిజేరియన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు యశోద, శిల్పిని అన్నారు. జిల్లాలో అధిక శాతం కత్తెర కాన్పులు కావడంతో రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని ప్రశాంత్, సిద్దార్థ, ప్రియాంక దవాఖానల్లో తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ప్రశాంతి, వాసవి ఆసుపత్రుల్లో కూడా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయా దవాఖానల్లో రికార్డులను పరిశీలించి ల్యాబ్‌లను తనిఖీ చేసి టెక్నీషియన్ల గురించి ఆరా తీశారు. చికిత్సల ధరల పట్టికను డిస్‌ప్లేలో ఏర్పాటు చేయాలని, క్వాలిఫై సిబ్బందిని మాత్రమే తీసుకోవాలని సూచించారు. ప్రతి మహిళా స్కానింగ్‌ను కేసు షీట్‌లో పొందుపర్చాలన్నారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 76శాతం సిజేరియన్లు ఉంటే.. 83శాతం కత్తెర కాన్పులతో యాదాద్రి జిల్లా మొదటి స్థానంలో ఉన్నదన్నారు. వాటిని తగ్గించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామని చెప్పారు. సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతీ దవాఖానలో 50శాతం కన్నా తక్కువ సిజేరియన్లు ఉండాలని సూచించారు. లేకుంటే ఆయా ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసి అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కుటుంబ నియంత్రణపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సుమన్ కళ్యాణ్, రామకృష్ణ, కాటం రాజు, డెమో మధుసూదన్‌రెడ్డి, సీహెచ్‌ఓలు చంద్రశేఖర్, నగేశ్, హెచ్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇస్తారి పాల్గొన్నారు.

చౌటుప్పల్ మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు

## ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

చౌటుప్పల్, మే 17 : స్థానిక మార్కెట్ యార్డులోని ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని సీపీఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు మార్కెట్‌లో 15రోజులుగా ధాన్యం పోసి పడికాపులు కాస్తున్నారని, అకాల వర్షాలకు ఇప్పటికి రెండు సార్లు తడిసిందని అన్నారు. తక్షణమే లారీలను తీసుకొచ్చి కాంటా వేయాలని కోరారు. లేకుంటే 65వ జాతీయ రహదారిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ పాషా, నాయకులు గోశిక కరుణాకర్, ఉష్కాగుల శ్రీను, బత్తుల దాసు, బావండ్లపల్లి స్వామి, లక్ష్మయ్య, నర్సింహ, కృష్ణ, రాములు, శివకుమార్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : సీపీఎం

వలిగొండ, మే 17 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం డిప్యూటీ తాసీల్దార్ పుష్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి నెలులు దాటుతున్నా కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయన్నారు. లారీలు, గన్నీ బ్యాగుల కొరతతో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని, అకాల వర్షాలకు వడ్లు తడవకుండా రైతులకు టార్పాలిన్లు ఇవ్వాలని కోరారు. మూసీ పరీవాహక ప్రాంత రైతులు పండించిన ధాన్యాన్ని ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేయాలని, క్వింటాకు రూ.500 బోనస్ అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నర్సింహ, నాయకులు సురేశ్, సాయి రెడ్డి, లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.



డిప్యూటీ తాసీల్దార్ పుష్పకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

సంస్థాన్ నారాయణపురం, మే 17 : మండలంలోని వావిళ్లపల్లి గ్రామంలో వారం రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి తాటిచెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడడంతో వైర్లు తెగిపోయాయి. దాంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నమస్తే తెలంగాణలో 'తెగిన విద్యుత్ వైర్లు' పేరుతో కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు, సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలని వారం రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, నమస్తే తెలంగాణ పేపర్‌లో వచ్చిన వార్తను చూసి మరమ్మతులు చేశారని రైతులు తెలిపారు. కరెంట్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

# ఇద్దరు మహిళల కొట్లాట..!

- అనుమానాస్పద స్థితిలో ఒక మహిళ మృతి
- స్థానిక పోలీసుల దర్యాప్తుపై అనుమానం
- డీసీపీని ఆశ్రయించిన బాధితులు
- సమగ్ర దర్యాప్తునకు ఏసీపీని ఆదేశించిన సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): ఇద్దరు మహిళలు కొట్టుకున్నారు. అందులో ఒక మహిళ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గొడవ కారణంగానే మృతి చెందినట్టు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా.. సైదాబాద్ పోలీసులు మాత్రం ఆమె అనారోగ్యంతో మృతి చెందినట్లు పేర్కొంటూ.. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత సెక్షన్లు మార్చుతామంటూ కుటుంబ సభ్యులను స్టేషన్ చుట్టూ తిప్పి పంపుతున్నారు. ఈ ఘటన జరిగి 15 రోజులవుతున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కేసు గూర్చి పట్టించుకోకపోవడంపై మృతురాలి కుటుంబ సభ్యులు సౌత్‌ఈస్ట్ డీసీపీ జానకీ దరవాత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై సమగ్రంగా దర్యాప్తు జరుపాలంటూ డీసీపీ సైదాబాద్ ఏసీపీని ఆదేశించారు. సైదాబాద్ పీఎస్ పరిధిలోని సింగరేణి కాలనీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సింగరేణి కాలనీలో నివాసముండే శకుంతల బాయి (60), ఆమె ఇంటిముందు కిరాణా దుకాణం నిర్వహించే సువర్ణ గత నెల 25వ తేదీ రాత్రి కొట్టుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన శకుంతల అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చికిత్స పొందుతూ ఈ నెల 1వ తేదీన మృతి చెందింది. అయితే, గొడవ జరిగిన మరుసటి రోజు శకుంతలను దవాఖానలో చేర్పించి, సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని, ఆ తరువాత తమ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారని వెల్లడించారు. ఈ గొడవ కారణంగానే మృతి చెందినట్టు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, పోస్టుమార్టం నివేదిక తరువాతే తదుపరి దర్యాప్తు చేస్తామంటూ పోలీసులు చెబుతున్నారు. సైదాబాద్ పోలీసుల వ్యవహారం అనుమానంగా ఉందంటూ బాధిత కుటుంబ సభ్యులు డీసీపీని కలిశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా.. గొడవ కారణంగా దెబ్బలు తగిలి మృతి చెందిందా.. ఆ గొడవతో మనస్తాపానికి గురైందా? అనే అంశాలను పరిగణలోకి తీసుకొని తదుపరి విచారణ చేస్తామని బాధితులకు డీసీపీ భరోసా ఇచ్చారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకోవడంలో జాప్యం లేదన్నారు. బాధితులు తనను కలిశారని, వారు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకొని పోస్టుమార్టం రిపోర్టును వెంటనే తెప్పించి సమగ్రంగా దర్యాప్తు జరుపాలంటూ ఏసీపీని ఆదేశించినట్లు డీసీపీ 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు.

## హెరాయిన్ రవాణా కేసులో యువకుడి అరెస్టు

దినేశ్‌కుమార్

మన్సూరాబాద్, మే 17 : హెరాయిన్ రవాణా చేస్తున్న కేసులో ఓ యువకుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. అరెస్టయిన నిందితుడి నుంచి రూ. 3.90 లక్షల విలువైన హెరాయిన్ ప్యాకెట్లు, 1800 నగదు, బైకు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లింగారెడ్డి కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన దినేశ్ కుమార్ (20) ప్రస్తుతం ఎల్బీనగర్‌లోని సెంట్రల్ బ్యాంకు కాలనీలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా వెల్డర్. స్వగ్రామం నుంచి హెరాయిన్‌ను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు అతడిపై నిఘా పెట్టారు. దినేశ్ కుమార్ శుక్రవారం తన బైక్‌పై మన్సూరాబాద్ చౌరస్తా నుంచి ఆనందనగర్ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. అతడిని ఆపిన పోలీసులు బైకును తనిఖీ చేశారు. కవర్‌లో దాచి తీసుకెళ్తున్న 33 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో దినేశ్‌కుమార్‌కు హెరాయిన్ సరఫరా చేసిన అతడి సోదరుడు సురేశ్‌కుమార్, మిత్రులు దినేశ్ కళ్యాణ్ అలియాస్ దినేశ్ కుమార్, మనోజ్ అలియాస్ మనోహర్ లాల్, భన్వర్‌లాల్ పరారీలో ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాదాపూర్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ కథనం ప్రకారం.. దారు శ్రీనివాస్ (35), రాఘవులు పాల వ్యాపారులు. శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన శ్రీనివాస్ పాలు అమ్ముతుండగా.. రాఘవులు పాల లోడింగ్ కోసం వాహనాన్ని ఆపి రోడ్డుపై నిలబడ్డాడు. రాజేశ్ అనే వ్యక్తి మద్యం మత్తులో కారులో హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపు అతి వేగంగా వెళ్తూ శ్రీనివాస్, రాఘవులును ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన వారిని స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతిచెందగా.. రాఘవులు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

## లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలి

- కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

భువనగిరి కలెక్టరేట్, మే 17 : మున్సిపాలిటీ పరిధిలో డ్రాలో కేటాయించిన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో ఐదు సంవత్సరాల క్రితం సుమారు 500 డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించారన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు డ్రా తీసి లబ్ధిదారుల పేర్లు నిర్ణయించి, అలాట్మెంట్ లెటర్ సైతం పంపిణీ చేశారని తెలిపారు. ఇండ్లల్లోకి లబ్ధిదారులు వెళ్లకపోవడంతో నిర్మించిన గదులు పూర్తిగా చెడిపోయి విలువైన సామగ్రి దొంగతనానికి గురవుతున్నదన్నారు. లబ్ధిదారులకు ఇండ్లు అప్పజెప్పి విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సీపీఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, నాయకులు చింతల మల్లేశం, చిక్క నరసయ్య పాల్గొన్నారు.

మోత్కూరులోని మన గ్రోమోర్ దుకాణంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏఓ స్వప్న

## నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : ఏఓ

మోత్కూరు, మే 17 : రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని, నాసిరకం విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏఓ కె.స్వప్న అన్నారు. మున్సిపాలిటీ కేంద్రం, పాటిమట్ల గ్రామంలోని పలు ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన స్టాక్ రిజిస్టర్లు, రసీదులు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధీకృత లైసెన్స్ డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా రసీదు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని, కొనుగోలు సమయంలో లాట్ నెంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని రైతులకు సూచించారు. బీటీ-3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఆ విత్తనాలను విక్రయించినా, సాగు చేసినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా అలాంటి విత్తనాలు అమ్మితే తమకు సమాచారం అందించాలన్నారు. గత పంట అవశేషాలను తగులబెట్టవద్దని రైతులకు సూచించారు. తగులబెడితే భూమిలోని ఉపయోగపడే సూక్ష్మజీవులు, సేంద్రియ కర్బన పదార్థాలు కాలిపోయి భూసారం తగ్గుతుందని తెలిపారు.

## కాలు జారి తాటిచెట్టుపై వేలాడిన గీత కార్మికుడు

- జేసీబీ సాయంతో కిందికి దింపిన గ్రామస్తులు

జేసీబీ సాయంతో తాటి చెట్టు పైనుంచి పాపయ్యను కిందికి తీసుకొస్తున్న స్థానికులు

మోత్కూరు, మే 17 : ప్రమాదవశాత్తు కాలు జారడంతో ఓ గీత కార్మికుడు మోకు ముస్తాదుతో తాటిచెట్టు మధ్యలో వేలాడిన ఘటన మోత్కూరు మండలం ముశిపట్లలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల పాపయ్య శుక్రవారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు మధ్యకు వెళ్లగానే ప్రమాదవశాత్తు కాలు జారడంతో మోకు, ముస్తాదుతో వేలాడాడు. తన కాళ్లకు సపోర్టు లేకపోవడంతో భయంతో చెట్టు పైనుంచి కేకలు వేయడంతో పక్కనే ఉన్న రైతులు గమనించి జేసీబీని రప్పించారు. దాని సాయంతో కిందికి దింపారు. పాపయ్య క్షేమంగా బయటపడడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం రాత్రి కురిసిన వానకు తాటిచెట్టు తడిసి జారడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

## ఆలేరు మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఆలేరు రూరల్, మే 17 : ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ సత్యానంద్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల కోరం లేనందున వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశం తేదీని ప్రకటిస్తామన్నారు.

## ఫేక్ వీడియో అప్‌లోడ్ చేసిన నలుగురి అరెస్టు

- అరెస్టయిన వారిలో మల్కాజిగిరి కార్పొరేటర్

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): బహదూర్‌పురలోని ఒక పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతుందంటూ ఇటీవల ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే, ఎక్కడో.. ఎప్పుడో జరిగిన ఆ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి, వైరల్ చేయడంతోపాటు ఎన్నికలపై ప్రజల్లో అపోహలు సృష్టించే విధంగా వ్యవహరించారని నలుగురు యువకులను సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. డీసీపీ కవిత కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లో 2022లో జరిగిన ఎన్నికల సందర్భంగా తీసిన వీడియోను ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓల్డ్ సిటీలోని బహదూర్‌పురలో ఉన్న ఒక పోలింగ్ బూత్‌లో జరిగినట్లు చూపిస్తూ.. ఆ వీడియోన్ ఎక్స్, ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారింది. దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వీడియోను పరిశీలించారు. 2002కు సంబంధించిన వీడియోగా నిర్ధారించారు. ప్రజలను తప్పుదోవ పట్టించి, ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థపై అయోమయాన్ని సృష్టించే విధంగా ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు మల్కాజిగిరి కార్పొరేటర్ వరుపల్లి శ్రావణ్, నాంపల్లికి చెందిన మహ్మద్ బీన్ అల